క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మార్కాపురం టౌన్: పట్టణంలోని 5వ సచివాలయం 8వ బ్లాక్ పరిధి కోర్టు సెంటర్ నుంచి బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి సీఐటీయూ మద్దతు

కురిచేడు: పీడీఎఫ్ గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వెంకటేశ్వరరెడ్డికి సీఐటీయూ మద్దతు ఇస్తోందని సీఐటీయూ జిల్లా నాయకుడు వి. బాలకోటయ్య స్పష్టం చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంఘ మండల అధ్యక్షుడు సాల్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు, స్వచ్ఛ భారత్ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలపై స్పందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యదర్శి నాగమల్లేశ్వరి, పంచాయతీ యూనియన్ నాయకులు కె.అశోక్, ఎస్.వెంకటేశ్వర్లు, గుంజి శ్రీను, ముంతాజ్‌బేగం, వెంకటలక్ష్మి, నాగేంద్రం, అంజమ్మ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అకడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రార్థన మొదలు మధ్యాహ్న భోజనాల వరకు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించారు. పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళిక, పాఠశాల సంస్థాగత ప్రణాళిక, తరగతి వారీ, సబ్జెక్టుల వారీ బోధనాభ్యస స్థితిగతులను పరిశీలించారు. పరీక్షల సమాధాన పత్రాలపై తల్లిదండ్రుల సంతకాలు చేయించాలని సూచించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట రమణయ్య, వీరనారాయణ, పిచ్చిరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు

కంభం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం స్థానిక వై.జంక్షన్‌లో జరిగింది. వివరాలు.. విద్యుత్ కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, వాచ్‌మన్ చెన్నయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వై.జంక్షన్ సమీపంలో కారు ఢీకొట్టింది. ప్రకాశ్‌కు స్వల్ప గాయాలు కాగా చెన్నయ్య కాలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టమోటా రైతులకు సూచనలు

కంభం: టమోట పంటకు కాయతొలుచు పురుగు ఆశించిందని ఉద్యాన శాఖ అధికారి శ్వేత అన్నారు. మండలంలోని కందులాపురంలో సాగు చేస్తున్న టమోట పంటను మంగళవారం ఆమె పరిశీలించారు. పురుగు కోత దశలో కాయలను తొలిచి నాశనం చేస్తుందని, దీని నివారణకు డెప్ల బెంజరాన్ 200 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఐదు కిలోల తవుడు, క్లోరోపైరిపాస్ 500 ఎంఎల్, బెల్లం 500 గ్రాములు కలిపి వీటితో తయారు చేసిన మిశ్రమాన్ని ఒక రాత్రంతా పులియబెట్టి తర్వాత రోజు చిన్న చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేర్లపై సమానంగా చల్లితే పురుగు బయటకు వచ్చి తిని చనిపోతుందని రైతులకు సూచించారు.

స్టేట్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక


విక్టరీ చూపుతున్న సంధ్య, రుషిత

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన అండర్–17 బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. 10వ తరగతి చదువుతున్న వి.రుషిత, 9వ తరగతి చదువుతున్న టి.సంధ్య రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. తోటి బాలికలు రుషిత, సంధ్యను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

గిద్దలూరు రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలోని శానిటేషన్ పనులు, పిడబ్ల్యూ పనుల ప్రతిపాదనలపై చర్చించారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అనువైన భవనం ఏర్పాటు కోసం కౌన్సిలర్లు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను ప్రదర్శించే వేదిక ఇగ్నైట్ యంగ్ మైండ్స్

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మార్కాపురం క్రికెట్ జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే చిన్నారుల్లో సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన అత్యుత్తమ చక్కటి వేదిక ఇగ్నైట్ యంగ్ మైండ్స్..అని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో గ్రూప్ డిస్కషన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతకు లోటు లేకున్నా ఆ నైపుణ్యాలు వెలికి తీసి, వాటికి పదును పెట్టి ప్రోత్సహించే సంస్థ లేకపోవడాన్ని గుర్తించి వారికి మంచి అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో తమ ఆలోచనలతో ఉపాధ్యాయులు, మేధావులు కలిసి రూపుదించిందే ఇగ్నైట్ యంగ్ మైండ్స్ అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుత ప్రతిభను కనబరిచిన విశ్వవిఖ్యాత ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కాలాం జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, కల్లం సుబ్బారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కె. నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ సాయిరాజేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, వినోద్, జాకీర్, షరీఫా పాల్గొన్నారు.

పీఆర్ జేఈకి మంత్రి సురేష్ పరామర్శ


జేఈ మహంకాళయ్య ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న పంచాయతీరాజ్ జేఈ మహంకాళయ్యను ఆయన స్వగృహంలో రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. త్రిపురాంతకానికి చెందిన మహంకాళయ్య యర్రగొండపాలెంలో పంచాయతీరాజ్ జేఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య పొన్నా వెంకటలక్ష్మి త్రిపురాంతకం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకురాలు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని జాగ్రత్తగా ఉండాలని జేఈకి మంత్రి సూచించారు. మంత్రి వెంట తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ మరియదాస్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ ఆళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ నాయకులు చిన్నత్రిపురారెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్, సత్యనారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, గుడిమెట్ల రంగయ్య ఉన్నారు.

రూ.2.75 కోట్లతో అభివృద్ధి పనులు

● రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని చైర్మన్‌కు కౌన్సిలర్‌ల వినతి


సమస్యలు సభ దృష్టికి తెస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్

మార్కాపురం టౌన్: పట్టణంలో రూ.2.75 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ అన్నారు. మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. భగత్‌సింగ్ కాలనీలో డ్రైనేజీ చివరి ప్రాంతం వరకు నిర్మించాలని, కాలువ లేకపోవడంతో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ సభ దృష్టికి తెచ్చారు. అక్కమ్మ బావి వద్ద అంగన్‌వాడీ భవనం నిర్మించాలని కోరారు. పట్టణంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలని కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ సభ దృష్టికి తెచ్చారు. పబ్లిక్ టాయిలెట్‌ల వద్ద నీటి వసతి లేకపోవటంతో వాసన వస్తోందని సభలో తెలిపారు. సప్లయ్ చానల్ మురుగు నీటితో కూడి దుర్గంధం వెదజల్లుతోందని, శుభ్రం చేయించాలని కౌన్సిలర్ కోరారు. మరనాత చర్చి వెనుక వైపు పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయని, ఆ సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ హర్షితబాబీ సమావేశంలో కోరారు. దివంగత గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహం నిర్మించాలని కౌన్సిలర్‌లు నగేష్, బుశ్శెట్టి నాగేశ్వరరావులు చైర్మన్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ పట్టణంలో ఆరు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. పబ్లిక్ టాయిలెట్‌ల వద్ద సింగిల్ ఫేజ్ బోరులు ఏర్పాటు చేసి నీటి వసతిని కల్పిస్తామని స్పష్టం చేశారు. అమృత్ మహోత్సవం 2.0లో భాగంగా రూ.1.40 కోట్లతో సప్లయ్ చానల్ అభివృద్ధికి, గ్రీనరీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నిధుల లభ్యత ఆధారంగా పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలందరికీ మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమావేశంలో వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో కమిషనర్ గిరికుమార్, డీఈ సుభానీ, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కాకానితో మద్దిశెట్టి రవీంద్ర భేటీ


కాకానికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మద్దిశెట్టి రవీంద్ర

తాళ్లూరు: వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర మంగళవారం నెల్లూరులో కలిశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో రైతులకు కలుగుతున్న ఉపయోగాలపై ఆయనతో రవీంద్ర చర్చించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

గిద్దలూరు రూరల్: కుష్టు వ్యాధిపై అవగాహన ఉంటే వ్యాధి నివారణకు ప్రయత్నించవచ్చని సంజీవరాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సుమయ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంజీవరాయుడుపేట పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎస్ మల్లికార్జునరెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


బోల్తాపడిన లారీ

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో మంగళవారం తెల్లవారు జామున అదుపుతప్పి లారీ బోల్తా పడటంతో డ్రైవర్ నాగరాజుకు గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా ప్యాపిలి నుంచి ఓ లారీ టమోటా లోడ్‌తో మార్టూరు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్యాపిలి వెళ్తోంది. మార్గమధ్యంలో అద్దంకి–దర్శి ప్రధాన రహదారి ముండ్లమూరు బ్రహ్మంగారి గుడి కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ నాగరాజుకు గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రుడిని సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. ప్రమాద స్థలం వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్నారు. అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం పసుపుగల్లుకు చెందిన యువకుడి బైకు ఇసుకపైకి వెళ్లడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. అతను స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

రహదారి భద్రతపై అవగాహన


మాట్లాడుతున్న శివకుమార్

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలు నివారించవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అన్నా కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ రోడ్ సెఫ్టీ ఎక్స్‌పర్ట్ శివకుమార్ మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

వీఆర్‌ఓ కృష్ణారెడ్డికి ఘన సన్మానం


వీఆర్‌ఓ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

త్రిపురాంతకం: గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న దూపాడు వీఆర్‌ఓ కృష్ణారెడ్డిని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. వీఆర్వో సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్‌తోపాటు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కెఎస్‌పల్లె, పాదలకుంటపల్లె గ్రామాల్లోని ప్రైమరీ స్కూల్స్ విద్యార్థులకు మంగళవారం ఎన్‌పీసీపీసీఎఫ్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దంత సమస్యలతో పాటు వారు తాగే నీటి నమూనాలు సేకరించేందుకు ప్రభుత్వం పరీక్షలు చేస్తోందన్నారు. వైద్యాధికారి నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

తీరిన గ్రామస్తుల కష్టాలు



గ్రామంలో నాడు రోడ్డు పరిస్థితి



నేడు ఇలా..

● ఎమ్మెల్యే కేపీకి గ్రామస్తుల కృతజ్ఞతలు

మార్కాపురం: మండలంలోని మాల్యవంతునిపాడులో పాఠశాలకు వెళ్లే రహదారి దుస్థితిపై గ్రామస్తులు ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ రహదారిలో రోడ్డు అధ్వానంగా ఉండి గ్రామస్తులు, విద్యార్థులు రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కేపీ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మించి డ్రైనేజ్ కాలువలు కట్టినట్లు ఎంపీడీఓ చందన తెలిపారు. గ్రామస్తులు ఎమ్మెల్యే కేపీకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు మంచి సేవలందించాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

మార్కాపురం: వివిధ గ్రామాల నుంచి రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు మంచి సేవలందించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. మార్కాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రస్తుతం ఆమె పొదిలి తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. గతంలో మార్కాపురం డిప్యూటీ తహసీల్దార్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

డీఈ ఖదీర్‌బాషా సేవలు ప్రశంసనీయం


డీఈని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: హౌసింగ్ డీఈ ఖదీర్‌బాషా సేవలు ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆయన కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందిన సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలోని తన నివాస గృహంలో మంగళవారం డీఈకి శాలువా కప్పి సన్మానించారు. హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది మహేష్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి నంద్యాల వీరకుమార్ మంగళవారం ఉదయం పట్టణంలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం గిద్దలూరు తరలించారు. జిల్లా అధ్యక్షుడు ఒవీ వీరారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కార్యదర్శులు ప్రభాకర్, వెన్నా వెంకటరెడ్డి, రవికుమార్, టి.సత్యనారాయణరెడ్డి, డి.వెంకటరెడ్డి, శ్రీనివాసనాయక్‌లు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

గిద్దలూరు రూరల్: వీరకుమార్ భౌతిక దేహాన్ని గిద్దలూరు తరలించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం సాయంత్రం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. తొలుత మధ్యాహ్నం 2 గంటలకు తోకపల్లె గ్రామంలో సద్గురు యోగానంద నరసింహస్వామి 67వ పుట్ట తిరునాళ్ల మహోత్సవానికి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతోపాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం: పట్టణ శివారు ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ కృష్ణారావు మంగళవారం వినతి పత్రం అందించారు. అక్కడ నివశిస్తున్న ప్రజలకు పూర్తి స్థాయిలో వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు కృష్ణారావు తెలిపారు. మస్తాన్‌వలీ, రంగారెడ్డి, వలీ, మరియాదాస్, షేక్ హజీ, కాశీరావు పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు అవగాహన సదస్సు

తర్లుపాడు: జగనన్న గృహసారథులకు మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు వెల్లడించారు. కార్యక్రమానికి మార్కాపురం శాసన సభ్యుడు కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీపీ భూలక్ష్మి రామ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిరా హనుమారెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు.

గృహసారథులు అంకితభావంతో పని చేయాలి

తాళ్లూరు: గృహ సారథులు అంకితభావంతో పని చేసి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా, వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని జెసీఎస్ మండల కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి కోరారు. దోసకాయలపాడు పంచాయతీ పరిధి తోట వెంగన్నపాలెంలో మంగళవారం గృహ సారథులను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంలో పార్టీ బలోపేతానికి గృహసారథులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ పీఎస్ ప్రభాకర్‌రెడ్డి, కైలాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, కె. వెంకటేశ్వరరెడ్డి, జెసీఎస్ సచివాలయ కన్వీనర్‌లు అంజమ్మ, వెంకటరెడ్డి వలంటీర్లు ఉన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో ఒకటో తేదీ నుంచి పంపిణీ చేస్తున్న రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లను, ఎండీఎం ఆపరేటర్లను తహసీల్దార్ దాసు ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు రేషన్ అందజేయాలన్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ ఇవ్వాలని, తూకంలో లేడాలు లేకుండా పంపిణీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గోడౌన్ డీటీ తిరుపతిరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేతో సర్పంచ్‌ల సమావేశం

మార్కాపురం: మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్‌లతో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అరుణచెంచిరెడ్డి తెలిపారు. అందరూ హాజరు కావాలని కోరారు.

రేపు వినియోగదారులతో ముఖాముఖి

దర్శి: ప్రతి నెలా మొదటి గురువారం జిల్లాలోని ఒక ఆపరేషన్ డివిజన్‌లో వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్శి విద్యుత్ డివిజన్ ఈఈ ఎస్‌డీ అబ్దుల్ కరీం తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ స్థానిక గడియారం స్తంభం దగ్గరలోని పీజీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జె.పద్మ జనార్దనరెడ్డి హాజరవుతారని తెలిపారు. దర్శి డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

కేజీబీవీ బాలికకు అస్వస్థత

దొనకొండ: స్థానిక కస్తూరిబా పాఠశాల బాలిక విప్పర్ల సుప్రియ గత నెల 24వ తేదీన అస్వస్థతకు గురై మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. వివరాలు.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుప్రియ కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవులకు స్వగ్రామం వెళ్లింది. 23వ తేదీ మధ్యాహ్నం పాఠశాలకు వచ్చి బాలికలతో కలిసిపోయింది. 24వ తేదీ తోటి విద్యార్థులతో ఆరోగ్యం బాగోలేదని చెప్పడంతో సమాచారం తెలుసుకున్న ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం మంగళగిరి ఎన్ఆర్ఐకి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఊపిరితిత్తులు, కిడ్నీలు ఇబ్బందికరంగా ఉన్నాయని, బాలిక విష పదార్థం సేవించిందని వైద్యులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

నవోదయ పరీక్ష దరఖాస్తుకు గడువు పెంపు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ఆఖరి తేదీని ఫిబ్రవరి 8వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీఈజీ ప్రసన్నకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ

పొదిలి రూరల్: పొదిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్కాపురం డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి మంగళవారం పరిశీలించారు. ముందుగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు చూశారు. పాఠశాల సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం తిని కూరలు రుచి చూశారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

రాచర్ల: మండలంలోని యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వాసవీ క్లబ్ అధ్వర్యంలో సోమిశెట్టి రంగారావు జ్ఞాపకార్థం భార్య సోమిశెట్టి శ్రీదేవి విద్యార్థులకు పరీక్ష అట్టలు మంగళవారం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ గిద్దలూరు రీజనల్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, హెచ్‌ఎం మంజురేఖ, వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ కందగట్ల వెంకట రమణ, యూత్ క్లబ్ ప్రెసిడెంట్ సూరే నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ ముప్పూరి రాజేశ్వరి, సూరే వేణుగోపాల్ పాల్గొన్నారు.